క్లుప్తంగా

రాజారెడ్డిని కలిసిన వైఎస్సార్‌సీపీ నేతలు



రాజగోపాల్‌రెడ్డిని కలిసిన వైఎస్సార్‌సీపీ నాయకులు

జలదంకి: ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డిని బుధవారం బ్రాహ్మణపల్లిలోని ఆయన నివాసంలో జలదంకి మండలం బ్రాహ్మణక్రాక వైఎస్సార్‌సీపీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. జలదంకి జెడ్పీటీసీ మేదరమెట్ల శివలీల ఆధ్వర్యంలో నాయకులు ఆయన్ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. జెడ్పీటీసీ శివలీలతో పాటు నాయకులందరూ మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని రాజగోపాల్‌రెడ్డి సూచించారు. ఆయన్ను కలిసిన వారిలో నాయకులు చేజర్ల హరిబాబురెడ్డి, వేలమూరి శ్రీదర్‌రెడ్డి, తుమ్మల శ్రీకాంత్‌రెడ్డి, తుమ్మల శ్రీనివాసులరెడ్డి, డీకే రెడ్డి, పాజర్ల ఏసోబు, వెంకటరమణయ్య ఉన్నారు.

ఐటీఐలో చేరేందుకు రెండో విడత అవకాశం



సంగం: 2023–24 విద్యా సంవత్సరంలో ఐటీఐలో ప్రవేశం పొందేందుకు అర్హులైన విద్యార్థుల నుంచి రెండో విడత దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సంగం ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ కె.ఏడుకొండలు తెలిపారు. బుధవారం నుంచి ఈ నెల 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకుందుకు అవకాశం ఉందని తెలిపారు. సంగం ఐటీఐ కళాశాలలో ఫిట్టర్ విభాగంలో మాత్రమే సీట్లు ఉన్నాయని, దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఆగస్టు 3వ తేదీ కౌన్సిలింగ్‌కు హాజరుకావాలని కోరారు. వివరాలకు 9866720544, 9963950604 నంబర్లలో సంప్రదించాలన్నారు.


చర్చి నిర్మాణానికి జీఎంకే ట్రస్ట్ విరాళం



నిర్వాహకులకు నగదు అందిస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

ఉదయగిరి: మండలంలోని నేలటూరులో నూతనంగా నిర్మిస్తున్న చర్చి నిర్మాణానికి మండల పరిషత్ ఉపాధ్యక్షుడు, జీఎంకె ట్రస్ట్ అధినేత గుంటుపల్లి మాలకొండయ్యచౌదరి బుధవారం తన ప్రతినిధుల ద్వారా రూ.20 వేలు నగదును నిర్వాహకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు బి.వెంకటేశ్వర్లు, జానీ, గఫూర్, మాధవ తదితరులు పాల్గొన్నారు.

ఏఓ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన వేణుగోపాలరావు

వరికుంటపాడు: వరికుంటపాడు ఎంపీడీఓ కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా నియమించిన వేణుగోపాలరావు బుధవారం స్థానిక కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. చేజర్లలో సీనియర్ సహాయకుడిగా పనిచేస్తూ పదోన్నతిపై వరికుంటపాడు ఎంపీడీఓ కార్యాలయ పరిపాలనా అధికారిగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరిస్తానన్నారు.

ఫ్యామిలీ ఫిజిషియన్ సేవలు వినియోగించుకోవాలి



ఇంటి వద్దనే రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ శ్రీనివాసులరెడ్డి

సంగం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఫ్యామిలీ ఫిజిషియన్ సేవలు వినియోగించుకోవాలని సంగం పీహెచ్‌సీ డాక్టర్ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. సంగంలో బుధవారం ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ మెయిన్ బజార్‌లోని ఇళ్ల వద్దకు వెళ్లి గర్భిణులు, వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

మాట మారింది..!

- స్వపక్షం అయితే పొగడ్తలు, అధికార పక్షం అయితే తలాతోకలేని ఆరోపణలు
- పేరుకే యువగళం.. యువనేతకు నో ఛాన్స్
- యాత్రకు కాకర్ల సురేష్‌ను దూరం పెట్టిన అధిష్టానం
- ఉదయగిరిలో లోకేశ్ సాక్షిగా చీలిన టీడీపీ
- రగిలిపోతున్న బొల్లినేని వ్యతిరేక వర్గాలు

రాష్ట్రంలో చచ్చిపోయిన తెలుగుదేశంను బతికించుకునేందుకు నారా లోకేశ్ చేస్తున్న యువగళం యాత్ర దారి తప్పింది. లోకేశ్ యాత్ర ప్రారంభించినప్పటి నుంచి ప్రతి నియోజకవర్గంలో అధికార పార్టీ ఎమ్మెల్యేలపై నిరాధారమైన ఆరోపణలు చేస్తూ వస్తున్నాడు. ఉదయగిరికి వచ్చే సరికి ఏకంగా గతంలో నిర్దేశించిన విధంగా నియోజకవర్గంలో పర్యటించాల్సిన మండలాలను తప్పించి శివారు నుంచి ప్రకాశం జిల్లాలోకి వెళ్లిపోయారు. ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి టీడీపీకి జైకొట్టడం, ప్రస్తుతం మేకపాటి కుటుంబ సభ్యుడే వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జిగా ఉండడంతో ఈ నియోజకవర్గం గురించి ఏమీ మాట్లాడకుండా వెళ్లడం విశేషం. స్వపక్షం అయితే పొగడ్తలు, అధికార పక్షం నిరాధారణ ఆరోపణలు చేయడమే లోకేశ్ లక్ష్యమని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



ఉదయగిరి: యువగళం యాత్రతో ఉదయగిరి నియోజకవర్గంలో పార్టీకి మేలు కంటే డ్యామేజ్ బాగా జరిగింది. వచ్చే ఎన్నికల్లో యువతకు పార్టీలో అధిక ప్రాధాన్యం ఉంటుందని తండ్రీ, కొడుకులు మాటలు నీటి మూటలే అని తేలిపోయింది. 2109 ఎన్నికల్లో చావు దెబ్బతిన్న టీడీపీని జాకీలు పెట్టి లేపే ప్రయత్నంలో బొల్లినేని రామారావు పూర్తిగా విఫలమయ్యారు. ఈ నేపథ్యంలో టీడీపీ ఉనికి కోసం డబ్బు ఖర్చు పెట్టే ఎన్ఆర్ఐ కాకర్ల సురేష్‌కు చినబాబు టికెట్ ఆశచూపి రంగంలోకి దించారు. దీంతో కాకర్ల సురేష్ ట్రస్ట్ పెట్టి వివిధ సేవా కార్యక్రమాల పేరుతో ప్రజల్లోకి వచ్చారు. టీడీపీలో బొల్లినేని అసమ్మతి వర్గం అంతా కాకర్ల చుట్టూ చేరింది. క్రమేణా పార్టీపై కాకర్ల పట్టు బిగిసుకోవడం ప్రారంభమైంది. ఈ పరిణాలమాను సహించలేని బొల్లినేని రామారావు వెంటనే రంగంలోకి దిగారు. కాకర్ల కార్యకలాపాలకు చెక్ పెట్టే ప్లాన్ రెడీ చేశారు. లోకేశ్ యాత్రలో పలుమార్లు కాకర్ల చినబాబును కలిసి పార్టీ బలోపేతానికి తాను చేస్తున్న కార్యక్రమాలు గురించి చెప్పుకుంటూ వచ్చాడు. దీంతో బొల్లినేని, కాకర్ల వర్గీయులు మధ్య అగాధం మరింత పెరిగింది. పార్టీ కార్యక్రమాలు కూడా ఎవరికి వారే నిర్వహించుకుంటూ వచ్చారు. అయితే కాకర్ల దూకుడు బొల్లినేనికి రుచించలేదు. ఎలాగైనా ఉదయగిరి యాత్రలో కాకర్లకు చెక్ పెట్టాలని బొల్లినేని డిసైడ్ అయ్యారు. దీంతో తన వర్గీయులను కాకర్ల అనుచరులపై ఉసికొల్పారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొల్లినేని రామారావు అనుమతి లేకుండా ఎక్కడా కాకర్ల పార్టీకి సంబంధించిన కార్యకలాపాలు నిర్వహించకూడదని రామారావు అనుచరులు ఆంక్షలు విధించారు. అయినా కాకర్ల వర్గం లెక్క చేయకుండా యువగళం కరపత్రాలు పంపిణీ, యాత్రకు స్వాగత ద్వారాలు, ఫ్లెక్సీలు భారీగా పెట్టి లోకేశ్‌ను దృష్టిని తన వైపు మళ్లించుకునే ప్రయత్నం చేశారు. ఈ పరిస్థితి బొల్లినేని అనుచరులు తట్టుకోలేకపోయారు. కాకర్ల ఫ్లెక్సీలు కట్టడాన్ని బొల్లినేని వర్గీయులు పలుచోట్ల అడ్డుకున్నారు. దీనిని ప్రతిఘటించిన కాకర్ల అనుచరులను బొల్లినేని వర్గీయులు చితికబాదారు. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై జలదంకి స్టేషన్‌లో కేసు నమోదైంది. ఇంత జరుగుతున్నా జిల్లాలో యాత్ర చేస్తున్న లోకేశ్ మౌనం వహించారు. యువతకు ప్రాధాన్యం ఇస్తామని చెబుతున్న మాటలకు, చేతలకు పొంతన లేదని రుజువు అయింది.

కాకర్లకు చెక్ పెట్టిన బొల్లినేని

లోకేశ్‌యాత్రలో కాకర్ల సురేష్ పాల్గొనేందుకు బొల్లినేని ఒప్పుకోలేదు. ఈ విషయం జిల్లా పార్టీ పెద్దల వద్దకు వెళ్లింది. వారు సర్దుబాటు చేయాలని చేసినా ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో చివరికి చంద్రబాబు వద్దకు ఉదయగిరి పంచాయతీ వెళ్లింది. బాబు బొల్లినేని మాటకే ప్రాధాన్యం ఇచ్చారు. పైగా కాకర్ల సురేష్‌కు చీవాట్లు పెట్టినట్లు ప్రచారం జరుగుతోంది. వెంటనే కాకర్ల అనుచరులు పెట్టిన కేసు ఉపసంహరించుకోవాలని హుకుం జారీ చేశారు. యాత్రలో పాల్గొనద్దు అని హెచ్చరించారు. దీంతో కాకర్ల సురేష్ తాను పెట్టిన కేసులు విత్‌డ్రా చేసుకున్నారు. యాత్రకు దూరంగా ఉండిపోయారు. కాకర్లను ప్రోత్సహించిన లోకేశ్ సైతం చివరకు కాకర్లకు మద్దతు చెప్పలేకపోయారు. అవసరం మేరకు వాడుకుని తర్వాత కరివేపాకులా చందంగా వ్యవహరిస్తున్నారు అని కాకర్ల వర్గీయులు మండి పడుతున్నారు. ఈ పరిణామాలు పార్టీ మునుగడపై తీవ్రర ప్రభావం చూపే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

రూట్ మార్చిన లోకేశ్

మొదట్లో షెడ్యూల్ ప్రకారం ఉదయగిరి నియోజకవర్గంలో సీతారామపురం మినహా అన్ని మండలాలను టచ్ చేస్తూ యువగళం పాద యాత్ర చేపట్టాలని రూట్ మ్యాప్ సిద్ధం చేశారు. అయితే ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖరరెడ్డి వైఎస్సార్‌సీపీ నుంచి సస్పెండ్ చేయడం, ఆయన టీడీపీకి జైకొట్టడంతో యాత్ర రూట్ మారింది. మొన్నటి వరకు ఎమ్మెల్యే అవినీతిపై దుమ్మెత్తి పోసినా బొల్లినేని సైతం కొండాపురం సభలో మాట కూడా ప్రస్తావించలేదు. జిల్లాలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేను టార్గెట్ చేస్తూ అసత్య ఆరోపణలు చేసిన లోకేశ్ వైఎస్సార్‌సీపీ నుంచి సస్పెండ్ అయి టీడీపీకి అనుకూలంగా మారిన ఆనం, కోటంరెడ్డి, మేకపాట నీతిపరులుగా కనిపించారా అంటూ రాజకీయ విమర్శలు వినిపిస్తున్నాయి. కొండాపురం సభలో లోకేశ్ ఎవరో రాసిచ్చిన చీటి చేతపట్టి నియోజవర్గాన్ని స్వర్గసీమగా మార్చుతానని హామీలు ఇచ్చారు. ఇవన్నీ కూడా గతంలో టీడీపీ హయాంలో ఇచ్చిన హామీలేని మళ్లీ లోకేశ్ చెప్పడంతో నియోజకవర్గం ప్రజలు నువ్వుకుంటున్నారు.

నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి



ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డిని కలిసి సమస్యలు విన్నవిస్తున్న పడమటినాయుడుపల్లి రైతులు

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): సోమశిల హైలెవల్ కెనాల్ పరిధిలోని భూములు, ఇళ్లు కోల్పోతున్న పడమటినాయుడుపల్లికి చెందిన నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి హామీ ఇచ్చారు. మర్రిపాడు మండలం బ్రాహ్మణపల్లిలోని తమ స్వగృహంలో పడమటినాయుడుపల్లికి చెందిన పలువురు రైతులు ఎమ్మెల్యేను కలిసి పరిహారం పంపిణీలో జరుగుతున్న జాప్యాన్ని వివరించారు. బ్యాంకుల్లో రుణాలు పొంది తిరిగి కట్టలేని పరిస్థితుల్లో భూములు వేలం వేస్తామని రైతులను బ్యాంకర్లు బెదిరిస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యే సంబంధిత ఉన్నతాధికారులతో మాట్లాడి త్వరితగతిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆత్మకూరు మున్సిపల్ వైస్ చైర్మన్ డాక్టర్ కేవీ శ్రావణ్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌ను మార్చాలని వినతి



సమస్యను సమన్వయకర్త రాజారెడ్డికి విన్నవిస్తున్న ఉపాధి కూలీలు

ఉదయగిరి: ఉదయగిరిలో పనిచేస్తున్న ఉపాధి హామీ క్షేత్ర సహాయకుడు తమకు వద్దని, అతన్ని తొలగించి గతంలో ఉన్న క్షేత్రసహాయకుడిని కొనసాగించాలని పలువురు ఉపాధి హామీ కూలీలు బుధవారం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజారెడ్డికి విన్నవించారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా నేలటూరు వెళ్లిన ఆయన్ను గ్రామ శివారులో ఉపాధి హామీ కూలీలు కారును ఆపి తమ సమస్యను విన్నవించారు. దీంతో స్పందించిన రాజారెడ్డి అధికారులతో చర్చించి సమస్య పరిష్కరించి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ముర్తుజాహుస్సేన్, కూలీలు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి



ఖాన్‌సాహెబ్‌పేటలో విద్యుత్ సమస్యలపై స్థానిక ప్రజలను వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఏపీఎస్‌పీడీసీఎల్ డీఈ జనార్దన్

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మర్రిపాడు మండలం డీసీపల్లి సచివాలయం పరిధిలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టితో పని చేస్తామని ఏపీఎస్‌పీడీసీఎల్ ఆత్మకూరు డివిజనల్ ఇంజినీరు జనార్దన్ తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఖాన్‌సాహెబ్‌పేట, డీసీపల్లి గ్రామాల్లో పర్యటించిన ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డికి స్థానిక ప్రజలు విద్యుత్ లైన్ ఇన్‌స్పెక్టర్ నాగులపాటి శివారెడ్డిపై పలు ఫిర్యాదులు చేశారన్నారు. ఎమ్మెల్యే అప్పటికప్పుడే ఫోన్ ద్వారా ప్రజల సమస్యలపై ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ క్రమంలో బుధవారం డీఈ జనార్దన్ ఖాన్‌సాహెబ్‌పేట, డీసీపల్లి గ్రామాల్లో పర్యటించి బాధితుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా విద్యుత్ శాఖ ఏఈ రామచంద్రయ్య, లైన్‌మెన్ నాగరాజు దృష్టికి తేవాలని, లైన్ ఇన్‌స్పెక్టర్ శివారెడ్డితో ఎలాంటి సమస్యలు తలెత్తినా తన దృష్టికి తేవాలని ప్రజలను ఆయన కోరారు. కార్యక్రమంలో ఆయన వెంట స్థానిక విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ విద్యార్థులకు కంటి పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

దుత్తలూరు: స్థానిక సీడ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఏపీ మోడల్ స్కూలు 9, 10 తరగతుల విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. 15 మంది విద్యార్థులకు కంటి సమస్య ఉన్నట్లు గుర్తించామన్నారు. తిరిగి వారికి సీడ్స్ ప్రాథమిక కంటి సంరక్షణ కేంద్రంలో పరీక్షలు నిర్వహించి ఉచితంగా కళ్లజోళ్లు అందజేస్తామన్నారు. సీడ్స్ సంస్థ ద్వారా దత్తత తీసుకున్న ప్రభుత్వ పాఠశాలల్లో కంటి పరీక్ష శిబిరాలు నిర్వహిస్తున్నట్లు సీడ్స్ సంస్థ ప్రతినిధి రసూల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్‌వీ ప్రసాద్ కంటి వైద్యశాలకు సంబంధించిన సుమన్, రమేష్, సలోమన్, ప్రిన్సిపల్ సైమన్‌రావు, సీడ్స్ బృంద సభ్యులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్ల మధ్య మురుగు తొలగించండి



ఆత్మకూరు మున్సిపల్‌లోని టిడ్కో ఇళ్ల మధ్య ఉన్న మురుగునీరు

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని టిడ్కో భవనాల మధ్య మురుగునీరు తొలగించాలని స్థానికులు మున్సిపల్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాంతంలో అధికంగా చేరి దుర్వాసన వెదజల్లడంతో పాటు దోమలు వ్యాప్తి చెందుతున్నాయని మురుగునీటి ప్రవాహ సౌకర్యం లేకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. మున్సిపల్ అధికారులు పరిశీలించి సిబ్బందితో మురుగునీరు తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

లోకేష్ సమక్షంలో నంద్యాల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల చేరిక

కొండాపురం: నారా లోకేష్ పాదయాత్ర కొండాపురం మండలంలో బుధవారం సాగింది. ఈ సందర్భంగా పార్లపల్లి వద్ద నంద్యాల జిల్లాకు చెందిన తాతిరెడ్డి తులసీరెడ్డి తన అనుచరులతో మాజీ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. పార్టీలోకి చేరిన వారికి లోకేష్ పార్టీ కుండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

ఆత్మకూరు: పట్టణంలోని సినిమాహాలు సమీపంలో మిరియాలకట్ట శ్మశానం వెనుక వైపు పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై ముత్యాలరావు తెలిపారు. బుధవారం సాయంత్రం ఆ ప్రాంతంలో గస్తీ నిర్వహిస్తుండగా పేకాట ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచినట్లు ఆయన వివరించారు. ఆయన వెంట ఎస్సై రాజేష్, సిబ్బంది ఉన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

అల్లూరు: అభివృద్ధి, ప్రజా సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ధ్యేయమని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని నార్త్‌మోపూర్ దళితవాడలో బుధవారం ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రతి ఇంటికి వెళ్లి వారికి ప్రభుత్వ పరంగా అందుదున్న సంక్షేమ పథకాల తీరును, గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్ల పనితీరును అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో వర్తించిన ప్రభుత్వ పథకాల బుక్‌లెట్‌ను అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికి వార్షిక క్యాలెండర్ ప్రకారం బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో సంక్షేమ పథకాల నగదు సాయాన్ని జమ చేస్తున్నారన్నారు. అటువంటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారని. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 30 ఏళ్ల కొనసాగుతారన్నారు. సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు దండా కృష్ణారెడ్డి, నీలం సాయికుమార్, ఊటు శ్రీకాంత్‌రెడ్డి, సాధిక్‌రెడ్డి, మధురెడ్డి, భాస్కర్, వెంకటేశ్వర్లు, బుర్రి మల్లికార్జున, గుణపాటి గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో చైతన్యం తేవాలి



మాట్లాడుతున్న ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి

ఆత్మకూరురూరల్: అర్హులైన పేదలు అందరికీ ప్రభుత్వం అందజేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు గ్రామ స్థాయిలో ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మండల పరిషత్ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. సచివాలయాల స్థాయిలో సంక్షేమం, అభివృద్ధి కోసం 90 రకాల పథకాలు ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ఒక్కో కుటుంబానికి ఆయా పథకాల ద్వారా లక్ష నుంచి రూ.4 లక్షల వరకు లబ్ధి చేకూరిందని తెలిపారు. నయా పైసా లంచం లేకుండా నేరుగా లబ్ధిదారులకు పథకాలు చేర వేసిన ఘనత వలంటీర్లు, సచివాలయ సిబ్బందికి దక్కుతుందన్నారు. ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్, తహసీల్దారు లక్ష్మీనరసింహం, జెడ్పీటీసీ ప్రసన్నలక్ష్మి తదితరులు మండలంలో వివిధ పథకాల ద్వారా అమలు చేస్తున్న కార్యక్రమాలను సభకు వివరించారు. ఎంఈఓ షేక్ నజీర్‌బాషా, ఆర్‌డబ్ల్యూఎస్, ట్రాన్స్‌కో, పంచాయతీరాజ్, ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ ఏఈలు నయోమి, సతీష్‌చంద్ర, ఖాదర్‌మస్తాన్, వెంకటేశ్వర్లు, అనిల్‌కుమార్ రెడ్డి, తదితరులు తమ శాఖల పరిధిలో జరుగుతున్న పురోగతిని వివరించారు. బట్టేపాడు సొసైటీ అధ్యక్షుడు వాసిపల్లి లక్ష్మీరెడ్డి, వాశిలి ఎంపీటీసీ లక్ష్మీ ప్రసన్న, ఆరవీడు సర్పంచ్ సూరం ప్రసాద్ రెడ్డి తదితరులు వివిధ సమస్యలపై అధికారుల దృష్టికి తెచ్చి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షులు ఉద్దాల పెంచలరావు, సంపూర్ణ, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఘన సన్మానం



బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరిస్తున్న విద్యార్థులు

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మర్రిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ ఇటీవల బదిలీపై వెళ్లిన పలువురు ఉపాధ్యాయులను పాఠశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు బుధవారం నిర్వహించిన ఘనంగా సన్మానించారు. హెచ్‌ఎం శివజ్యోతి, ఉపాధ్యాయులు వెంకటయ్య, పెంచలప్రసాద్, రమేష్, రామకృష్ణారెడ్డి, మహమ్మద్ రఫీ, సుధాకర్, బోధనేతర సిబ్బంది అల్లాభక్షు, మజహర్ తదితరులు విద్యార్థులపై ప్రేమాభిమానాలతో చదువు చెప్పిన తీరును పలువురు వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రజ్వలత, ఎంఆర్‌పీ రాజేంద్రకుమార్, విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భవిత కేంద్రంలో రికార్డుల పరిశీలన



భవిత కేంద్రంలో రికార్డులు పరిశీలించి మాట్లాడుతున్న జిల్లా కో ఆర్డినేటర్ ధనమ్మ

సంగం: సంగంలోని భవిత కేంద్రాన్ని బుధవారం సహిత విద్యా జిల్లా కో ఆర్డినేటర్ ధనమ్మ సందర్శించారు. కేంద్రంలోని రికార్డులు పరిశీలించారు. అనంతరం దివ్యాంగ విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలోని భవిత కేంద్రాల్లో ఉన్న దివ్యాంగ విద్యార్థులకు అన్ని వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. సమగ్ర శిక్ష అభియాన్ తరపున దివ్యాంగ విద్యార్థులకు ప్రత్యేకంగా ఉపకరణాలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి దివ్యాంగ విద్యార్థి అందరితో పాటు సమానంగా అభివృద్ధి చెందాలనేదే ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు జానకీరాం, మల్లయ్య పాల్గొన్నారు.

సోమశిల ప్రాజెక్ట్‌లో చీఫ్ ఇంజినీర్



సోమశిల ప్రాజెక్ట్‌ను పరిశీలిస్తున్న చీఫ్ ఇంజినీర్ వెంకటరమణ

చేజర్ల (సోమశిల): సోమశిల జలాశయాన్ని బుధవారం చీఫ్ ఇంజినీర్ వెంకటరమణ సందర్శించారు. జలాశయంలోని నీటి వివరాలను ఎస్ఈ వెంకటరమణారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం జలాశయంలో 26 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు ఆయన తెలిపారు. ఉత్తర, కండలేరు వరద కాలువలను పరిశీలించారు. గేట్ల పనితీరు వ్యవస్థలను, అడిగి తెలుసుకున్నారు. ఉత్తర, దక్షిణ కాలువల ఆయకట్టును, వాటికి అందించే నీటి స్థితిగతులపై వివరాలను ఆరా తీశారు. అప్రాన్ పనులు పరిశీలించారు. సోమశిల, కండలేరు ఫ్లడ్‌ఫ్లో కెనాల్ రిపేరుకు ఎస్టిమేషన్లు సిద్ధం చేయాలని తెలిపారు. త్వరలో రిపేర్లు చేయాలన్నారు. సోమశిల శివాలయాన్ని ఆనుకుని ఉన్న వాల్ ఎత్తు పెంచాలన్నారు. త్వరలోనే అప్రాన్ పనులు ప్రారంభమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సోమశిల ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దశరథరామిరెడ్డి, డిప్యూటీ ఇంజినీర్ రవీంద్రప్రసాద్, జేఈలు, తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ అధ్యక్షుడి ఎన్నిక



ఎంపీపీ ఎంపికపై సమీక్షిస్తున్న ఎంపీటీసీలు, నాయకులు

చేజర్ల: చేజర్ల మండల పరిషత్ అధ్యక్ష పదవికి గురువారం ఎన్నిక జరగనుంది. చేజర్ల ఎంపీపీ స్థానం ఓసీ జనరల్ కావడంతో పోటీ అనివార్యమైంది. అయితే ఎంపీపీ పదవిని ఆశిస్తున్న నేతల మధ్య రాజీ ఒప్పందం జరిగింది. స్థానిక మండల పరిషత్ అధ్యక్ష పదవి కాలం ఐదేళ్లలో ఇద్దరు ముఖ్య నేతలు చెరి సగం కాలం కొనసాగాలని ముందుస్తుగానే జరిగిన ఒప్పందం మేరకు ఇప్పటి వరకు ఎంపీపీగా ఉన్న బాలిరెడ్డి రమాదేవి ఇటీవల రాజీనామా చేశారు. ఆ స్థానం భర్తీకి ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నేపథ్యంలో మండల ప్రజాపరిషత్ ప్రత్యేక అత్యవసర సమావేశం మండల కార్యాలయంలో ఆపద్ధర్మ ఎంపీపీ వేలూరు తిరుపతి నాయుడు అధ్యక్షతన బుధవారం జరిగింది. గురువారం జరిగే సమావేశంలో కొత్త ఎంపీపీని ఎన్నుకోనున్నారు. ఈ విషయమై ఆపద్ధర్మ ఎంపీపీ వేలూరు తిరుపతి నాయుడుతో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, ఎంపీటీసి తూమాటి విజయ భాస్కర్‌రెడ్డి సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో నాయకులు దొపాటి రవీంద్ర నాయుడు, బోయిళ్ల మాలకొండారెడ్డి, ప్రసాద్, ఓబయ్య నాయుడు, శ్రీనివాసులురెడ్డి, ఆనంద్‌రెడ్డి, పెంచలరెడ్డి, పెంచలస్వామి పాల్గొన్నారు.